ఇంటింటా సంక్షేమం.. ఊరూరా ప్రగతి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటింటా సంక్షేమం పరిఢవిల్లుతోంది. ఊరూరా అభివృద్ధి కొత్త పుంతలు తొక్కుతోంది. ప్రతి సచివాలయం పరిధిలో జనం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యేలు ఇంటింటికి వెళ్లి వారి సంక్షేమంతో పాటు స్థానికంగా నెలకొన్న సమస్యలు తెలుసుకుంటూ పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో గడపగడప కార్యక్రమంలో తెలియజేసిన సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు.

- గడప గడపకు సమస్యలపై ఎమ్మెల్యే ప్రత్యేక కార్యాచరణ
- 66 సచివాలయాల పరిధిలో రూ.13.20 కోట్లతో అభివృద్ధి పనులు
- 10 వేలకు పైగా సమస్యలు పరిష్కారం



గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి (ఫైల్)

ఆత్మకూరురూరల్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో నిర్వహిస్తున్న గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రత్యేక కార్యాచరణ ద్వారా సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు సాగుతున్నారు. నియోజకవర్గంలో మొత్తం 93 సచివాలయాల పరిధిలో ఇప్పటికే 66 సచివాలయాల పరిధిలో 100కు పైగా గ్రామాల్లో పర్యటించిన ఆయన ప్రజా సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తూ పరిష్కారాన్ని చూపుతున్నారు.

10 వేలకు పైగా సమస్యలకు పరిష్కారం

మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆత్మకూరు ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ప్రణాళిక మేరకు ప్రతి పనికి కార్యరూపం దాల్చే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. నియోజకవర్గంలో పర్యటన సందర్భంగా ప్రజలు తెలుపుతున్న సమస్యలను అధికారులకు తెలిపి పరిష్కరించాలని సూచిస్తున్నప్పటికి మళ్లీ అవే అర్జీలు పునరావృతమవుతుండడంతో ప్రతి గడపలో సమస్యలను గుర్తించే విధంగా వలంటీర్లతో 50 గృహాలకు ఒక ప్రత్యేక గ్రీవెన్స్ బుక్ ఏర్పాటు చేశారు. తద్వారా వచ్చిన సమస్యలను ఆయా శాఖల అధికారులతో ప్రత్యేక సమీక్షలు నిర్వహిస్తూ వ్యక్తిగత, అభివృద్ధి సమస్యలను పరిష్కరిస్తూ వస్తున్నారు. ప్రత్యేక గ్రీవెన్స్ పుస్తకాల ద్వారా ఇప్పటి వరకు ఎమ్మెల్యే దృష్టికి వచ్చిన 24 వేలకు పైగా సమస్యల్లో 10 వేలకు పైగా సమస్యలకు పరిష్కారం చూపారు. మిగిలిన సమస్యలు, అభివృద్ధి, వ్యక్తిగత సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించి పనులు పూర్తయ్యేలా చూస్తున్నారు.

రూ.13.20 కోట్ల అభివృద్ధి పనులు

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ఆత్మకూరు నియోజకవర్గంలో ఇప్పటి వరకు 66 సచివాలయాల్లో ఎమ్మెల్యే మేకపాటి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి సచివాలయం పరిధిలో ప్రజలు తెలుపుతున్న అభివృద్ధి పనులకు అవసరమైన నిధులను గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మంజూరు చేయించి ప్రాధాన్యతా క్రమంలో పనులు చేయిస్తున్నారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో రూ.1.20 కోట్లు, సంగం మండలానికి రూ.2.20 కోట్లు, మర్రిపాడుకు రూ.2.80 కోట్లు, ఏఎస్‌పేటకు రూ.1.80 కోట్లు, ఆత్మకూరురూరల్ రూ.1.60 కోట్లు, చేజర్లకు రూ.1.20 కోట్లు, అనంతసాగరం మండలానికి రూ.1.80 కోట్ల వంతున ఇప్పటి వరకు నియోజకవర్గం మొత్తం మీద రూ.13.20 కోట్ల మేర అభివృద్ధి పనులను మంజూరు చేయించి ప్రధాన సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నారు.

రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ

మెట్ట ప్రాంతం ఆత్మకూరు నియోజకవర్గంలో ప్రధానంగా ప్రజలు తెలుపుతున్న రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్ రెడ్డి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. వలంటీర్, వీఆర్‌ఓలతో పాటు ప్రజాప్రతినిధులను, స్థానిక నాయకులను భాగస్వాములను చేసి ప్రతి ఇంట్లో రెవెన్యూ సమస్యల జాబితాలను సిద్ధం చేయాలని ఆదేశించియున్నారు. ఈ జాబితాలతో ఉన్నతాధికారులతో సమీక్ష సమావేశాలు నిర్వహించి సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించి నియోజకవర్గంలో రెవెన్యూ సమస్యల పరిష్కరించే విధంగా చూస్తున్నారు. రాష్ట్రంలో ఏ శాసనసభ్యుడు చేయని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందజేస్తున్న సంక్షేమ పథకాలను అందించడమే కాకుండా ప్రణాళికాబద్ధంగా సంక్షేమం, అభివృద్ధి పనులను పూర్తి చేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కృషికి ప్రజలతో పాటు ప్రజాప్రతినిధులు, అధికారులు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

అరుణాచలం గిరిప్రదక్షిణకు బస్సులు

కావలి: అరుణాచలం గిరిప్రదక్షిణకు వెళ్లే భక్తులు, యాత్రికుల సౌకర్యార్థం కావలి డిపో నుంచి రద్దీని బట్టి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నామని డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు తెలిపారు. ఈ బస్సులు ఈ నెల 31వ తేదీ ఉదయం 8 గంటలకు కావలిలో బయలుదేరి రాత్రికి అరుణాచలం చేరుతాయని, గిరిప్రదక్షిణ అనంతరం తిరిగి బయలుదేరి 1వ తేదీ సాయంత్రానికి కావలికి చేరుతాయన్నారు. ఈ సర్వీసులకు సీట్ రిజర్వేషన్ సౌకర్యం ఉందని, గిరిప్రదక్షణకు వెళ్లే కావలి ప్రాంత భక్తులు ముందుగా రిజర్వేషన్ చేయించుకోవాలని డీఎం శ్రీనివాసులు కోరారు.

నేడు గడపగడపకూ మన ప్రభుత్వం

కొండాపురం: మండలంలోని శెట్టిపాళెం పంచాయతీలో మంగళవారం మధ్యాహ్నం నుంచి ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చిమ్మిలి రాజేంద్రప్రసాద్ శనివారం తెలిపారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు జయప్రదం చేయాలని కోరారు.

58.4 మీ.మీ.ల వర్షపాతం

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు రెవెన్యూ డివిజన్‌లో సోమవారం 58.4 మీ.మీ. వర్షపాతం నమోదైందని డివిజనల్ గణాంకాధికారి విజయకుమారి తెలిపారు. మండలాల వారీగా సీతారామపురంలో 11.6 మీ.మీ., ఉదయగిరిలో 4, మర్రిపాడు 7.6, ఆత్మకూరు 6.8, అనంతసాగరం 2.2, అనుమసముద్రంపేటలో 4.2, సంగంలో 6.4, చేజర్లలో 8.4, కలువాయిలో 7.2 మీ.మీల చొప్పున వర్షపాతం నమోదైందని వివరించారు.

నూతన భవనంలోకి బ్యాంకు ఆఫ్ ఇండియా



నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న బీఓఐ జోనల్ మేనేజర్ బంగార్రాజు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): మర్రిపాడు మండలం కృష్ణాపురంలో ఉన్న బ్యాంక్ ఆఫ్ ఇండియా శాఖ సోమవారం నూతన భవనంలోకి మారింది. బీఓఐ జోనల్ మేనేజర్ ఎంవీవీ బంగార్రాజు ప్రత్యేక పూజలు నిర్వహించి బ్యాంక్ కార్యకలాపాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఏరియా మేనేజర్ శ్రీనివాసశాస్త్రి, బ్రాంచ్ మేనేజర్ ప్రతాప్‌సింగ్, మాజీ సర్పంచ్ ముటుకుందు లక్ష్మీరెడ్డి, సిద్ధారెడ్డి, పలు గ్రామాలకు చెందిన బ్యాంకు ఖాతాదారులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి తహసీల్దార్‌గా లక్ష్మీనరసింహులు

చేజర్ల: చేజర్ల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా పి.లక్ష్మీనరసింహులు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పని చేస్తున్న ఎల్.రామ్మోహన్‌రావు సెలవుపై వెళ్లడంతో ఆత్మకూరు తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న లక్ష్మీనరసింహులును చేజర్ల ఇన్‌చార్జి తహసీల్దార్‌గా నియమించారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

ఎంపీపీని కలిసిన జూనియర్ కళాశాల సిబ్బంది



ఎంపీపీ సన్మానిస్తున్న కళాశాల అధ్యాపకులు

చేజర్ల: ఎంపీపీ తూమాటి విజయభాస్కర్ రెడ్డిని చేజర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల బోధన, బోధనేతర సిబ్బంది సోమవారం ఆయన నివాసంలో కలిసి సన్మానించారు. కళాశాల సమస్యలు, విద్యార్థులకు హాస్టల్ సౌకర్యం కల్పించాలని ఎంపీపీ దృష్టికి తీసుకొచ్చారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



బదిలీ ఉపాధ్యాయులను సన్మానించిన ఉపాధ్యాయులు

ఉదయగిరి: ఉదయగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తూ ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో వివిధ ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన నలుగురు ఉపాధ్యాయులకు సోమవారం పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది సన్మాన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం బాలకేశవులు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సిబ్బంది బదిలీ ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు.

సీఐ గిరిబాబుకి సర్పంచ్‌ల సంఘం ఘన సన్మానం



సీఐ గిరిబాబును సన్మానిస్తున్న నాయకులు

ఉదయగిరి: విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో పాటు, క్లిష్టమైన వివిధ కేసులను తనదైన శైలిలో ఛేదించి ఉన్నతాధికారుల మన్ననలు పొందిన స్థానిక సీఐ వి.గిరిబాబును సోమవారం మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు కల్లూరి వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో పలువురు సర్పంచ్‌లు, నాయకులు సర్కిల్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఆయన్ను శాలువాలు, పూలమాలలతో సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ భవిష్యత్‌లో మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దాసరపల్లి సర్పంచ్ సయ్యద్ గౌస్‌మొహిద్దీన్, మండల జేసీఎస్ కన్వీనర్ కల్లూరి కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు దారపనేని చెన్నయ్య, ఇత్తడి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలకు సత్వర పరిష్కారం



తహసీల్దారు కార్యాలయంలో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో పాల్గొన్న వివిధ శాఖల అధికారులు

ఆత్మకూరురూరల్: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన వినతులపై క్షేత్ర పరిశీలన చేసి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహశీల్దారు లక్ష్మీనరసింహం తెలిపారు. వివిధ శాఖల అధికారులతో కలిసి సోమవారం స్పందన అర్జీలను స్వీకరించారు. రెవెన్యూ రికార్డుల్లో సవరణలు, భూ వివాదాల పరిష్కారంతో పాటు ఇతర శాఖలకు చెందిన సమస్యలపై సంబంధిత అధికారులు ప్రజల నుంచి వినతులు స్వీకరించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్, వ్యవసాయాధికారి కిషోర్ బాబు, వివిధ శాఖల ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

అయ్యంకికి ఘన నివాళి



సంగం: అయ్యంకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఆత్మకూరురూరల్: వందేళ్లకు పూర్వమే గ్రంథాలయాల ఏర్పాటుకు కృషి చేసిన అయ్యంకి వెంకటరమణయ్య గ్రంథాలయ ఉద్యమ పితామహుడిగా ఖ్యాతి గడించారని పలువురు వక్తలు అన్నారు. ఆత్మకూరు శాఖా గ్రంథాలయంలో సోమవారం అయ్యంకి చిత్రపటానికి గ్రంథాలయ ఉద్యోగులు, పాఠకులతో కలిసి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాల ఏర్పాటుకు అయ్యంకి చేసిన సేవలను వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ ఓ శ్రీనివాసరాజు, రికార్డు అసిస్టెంట్ తనూజ, గ్రంథాలయ పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

అయ్యంకి జయంతి వేడుకలు

సంగం: స్థానిక గ్రంథాలయంలో సోమవారం లైబ్రేరియన్ రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి విద్యార్థులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అయ్యంకి వెంకట రమణయ్య జీవిత చరిత్రను విద్యార్థులకు వివరించారు. గ్రంథాలయస్థాపనకు ఆయన చేసిన కృషిని వివరించారు.

అయ్యంకి సేవలు చిరస్మరణీయం

చేజర్ల(సోమశిల): గ్రంథాలయ ఉద్యమకారుడు, ఆయుర్వేదం, ప్రకృతి వైద్యంలో సిద్ధ హస్తుడిగాచ, పత్రికా సంపాదకునిగా అయ్యంకి వెంకట రమణయ్య చేసిన కృషి, సేవలు చిరస్మరణీయమని అనంతసాగరం లైబ్రేరియన్ డి.నారాయణరావు అన్నారు. అనంతసాగరం గ్రంథాలయంలో సోమవారం ఆయన 133 జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జెడ్పీ హైస్కూల్‌లో అయ్యంకి వెంకట రమణయ్య చిత్ర పటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ హైస్కూల్ హెచ్ ఎం.లక్ష్మీ ప్రసన్న, సచివాలయం-1 సంక్షేమం విద్య అసిస్టెంట్ మురళి తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరు రూరల్: అయ్యంకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు, పాఠకులు



చేజర్ల: అయ్యంకి వెంకటరమణయ్య చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

టాస్క్‌ఫోర్స్ అధికారుల సమావేశం

వరికుంటపాడు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం మండల స్థాయి టాస్క్‌ఫోర్స్ అధికారుల సమావేశం జరిగింది. వైద్య, రెవెన్యూ, ఐసీడీఎస్, మండల పరిషత్ కార్యాలయ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల వైద్యాధికారిణి కరిష్మా మాట్లాడుతూ మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 7న ప్రత్యేక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం జరుగుతుందన్నారు. గ్రామాల్లో గర్భిణులు, 0–5 ఏళ్ల లోపు చిన్నరుల ఇంటింటా ఆశ, ఆరోగ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు సర్వే నిర్వహిస్తారన్నారు. సర్వేలో వ్యాధి నిరోధక టీకాలు వేయించుకోని చిన్నారులు, గర్భిణులను గుర్తిస్తామన్నారు. వారికి ప్రత్యేక టీకాల కార్యక్రమంలో టీకాలు వేయడం జరుగుతుందన్నారు. ఇంద్రధనస్సు కార్యక్రమం విజయవంతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ కార్యాలయ ఏఓ జి.వేణుగోపాల్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ ఎస్.మల్లికార్జునరావు, ఐసీడీఎస్ పర్యవేక్షకురాలు జేవీఎస్ఆర్ కళావతి, సీహెచ్ఓ రాజశేఖరరాజు, ఆరోగ్య సహాయకుడు వై.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు చెబుదాం వినతుల స్వీకారం



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న మర్రిపాడు తహసీల్దారు ఆనందరావు

ఆత్మకూరురూరల్(మర్రిపాడు): జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా మర్రిపాడు తహసీల్దారు కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. పలుశాఖల అధికారులు హాజరై ప్రజల వద్ద నుంచి వినతులు స్వీకరించారు. తహసీల్దారు ఆనందరావు, హౌసింగ్ ఏఈ రవికుమార్, వ్యవసాయ, ఉద్యానవనశాఖ అధికారులు రామ్మోహన్, రాజశేఖర్‌రెడ్డి, ఉపాధి హామీ ఏపీఓ సునీల్ తదితరులు తమ తమ శాఖలకు సంబంధించిన వినతులు స్వీకరించి సకాలంలో ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు.

నేటి నుంచి ఉపాధ్యాయులకు శిక్షణ తరగతులు



ఉదయగిరి: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు మంగళ, బుధవారాల్లో స్కూల్ కాంప్లెక్స్‌ల స్థాయిలో శిక్షణ తరగతులు జరుగుతాయని ఎంఈఓ-1 షేక్ మస్తాన్‌వలి సోమవారం తెలిపారు. ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ మంగళవారం గండిపాళెం, అప్పసముద్రం, కృష్ణాపురం, బిజ్జంపల్లి, బుధవారం ఉదయగిరి, వెంగళరావునగర్, గడ్డంవారిపల్లె, జి.చెరువుపల్లి పాఠశాలల కాంప్లెక్స్‌లో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిక్షణ జరుగుతుందన్నారు. ఉపాధ్యాయులు తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. కాంప్లెక్స్ చైర్మన్‌లు ప్రణాళికాబద్ధంగా, అర్థవంతంగా శిక్షణ నిర్వహించాలన్నారు. ఉపాధ్యాయులు టీచింగ్ డైరీ, నూతన పాఠ్యపుస్తకాలు తీసుకురావాలన్నారు. ఎవరికీ ఎలాంటి సెలవులు మంజూరు చేయబడవన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన



గానుగపెంట పంచాయతీలో ప్రజలకు సంక్షేమ పథకాలు బుక్‌లెట్లను అందిస్తున్న రాజగోపాల్‌రెడ్డి

- ఉదయగిరి సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి
- జోరువానలోనూ గడపగడపకు మన ప్రభుత్వం

కొండాపురం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో సుపరిపాలన అందిస్తున్నారని ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. సోమవారం గానుగపెంట పంచాయతీ పరిధిలో రాజగోపాల్‌రెడ్డి గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. రాజగోపాల్‌రెడ్డికి మహిళలు బొట్టు పెట్టి హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు. వృద్ధులు, రైతులు, మహిళలతో ఆప్యాయంగా మాట్లాడారు. అనంతరం జోరువాన కురుస్తున్నా లెక్క చేయకుండా ప్రతి గడపకూ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదాని అడిగి తెలుసుకున్నారు. ఆయా కుటుంబాలకు ఏ పథకం ద్వారా ఎంత లబ్ధి చేకూరిందో వివరిస్తూ బుక్‌లెట్లను అందించారు. ప్రజల సమస్యలను ఓపిగ్గా విని వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తొలి నెల నుంచే ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేయడం ప్రారంభించారన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలను ఏర్పాటు చేసి అర్హులైన వారందరికీ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నట్లు వివరించారు. తొలి ఏడాదిలోనే 90 శాతం హామీలు అమలు చేశారని గుర్తు చేశారు. ఈ నాలుగేళ్లలో చెప్పని పథకాలు, పనులెన్నో చేసి ప్రజలను ఆర్థికంగా నిలబెట్టేందుకు అహర్నిశలు కృషి చేశారన్నారు. అయితే ప్రజాక్షేత్రంలో ప్రజాబలం కోల్పోయామని మదనపడుతున్న ప్రతిపక్షంతో ఓ రాజకీయ పార్టీ నాయకులు నిస్వార్థంగా సేవ చేస్తున్న వలంటీర్లపై ప్రతిపక్ష నాయకులు ఆరోపణలు చేయడం తగదన్నారు. సంక్షేమ పథకాలు అందని వారు ఉంటే తమ దృష్టికి తెస్తే వారికి నేరుగా ఇంటి వద్దకే పథకాలు అందిస్తామన్నారు. సంక్షేమ పాలన అందిస్తున్న జగనన్నను నిండు మనసుతో ఆశీర్వదించాలని, అభివృద్ధి చేసే ప్రభుత్వానికి అండగా నిలవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బొడ్డు అనూరాధ, మండల కన్వీనర్ చిమ్మిలి రాజేంద్రప్రసాద్, ఎంపీటీసీ బంకా మాల్యాద్రి, గానుగపెంట, శెట్టిపాళెం సర్పంచ్‌లు మంచాల మల్లికార్జున, దంపూరు రాజశేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు చిన్ని కొండయ్య, దాసరి వెంకటేశ్వర్లు, బొచ్చు వంశీ, రామమూర్తి, మాజీ మండల కన్వీనర్ యారం నరసింహారావు, మర్రిగుంట సర్పంచ్ దార్ల గోపి, ఉదయగిరి వైఎస్సార్‌సీపీ నేత గాజుల తాజుద్దీన్, తహసీల్దార్ హుస్సేన్, ఎంపీడీఓ బ్రహ్మయ్య, వివిధ శాఖల మండల అధికారులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలకు శంకుస్థాపన



గృహనిర్మాణాలకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీపీ, అధికారులు

చేజర్ల: చేజర్లలోని ఎర్రగొండ లేఅవుట్ జగనన్న కాలనీలో గృహ నిర్మాణాలకు సోమవారం ఎంపీపీ తూమాటి విజయభాస్కర్‌రెడ్డి అధికారులతో కలిసి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఎన్నికల హామీలో ఇచ్చిన మాట ప్రకారం జగనన్న పేదలందరికీ సొంతింటి కల నిజం చేస్తూ ప్రభుత్వమే వారికి గృహ నిర్మాణాలను చేయించి అందిండం శుభ పరిణామమన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సొంతిల్లు లేనివారు ఉండకూడదనే సంకల్పంతో నవరత్నాల్లో భాగంగా అందరికీ ఇల్ల స్థలాలు, గృహాలు మంజూరు చేసి అందిస్తున్నారన్నారు. ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి కూడా జగనన్న కాలనీలపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ బి ప్రకాశ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ నజీర్‌బాషా, ఇంజినీరింగ్ అసిస్టెంట్ విజయలక్ష్మి, చేజర్ల సర్పంచ్ ఆవుల వెంకటేశ్వర్లు, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ బషీర్, ఉప సర్పంచ్ పుల్లయ్య యాదవ్ వైఎస్సార్‌సీపీ నాయకులు ఆనంద్ రెడ్డి, సుధీర్ రెడ్డి, పెంచలరెడ్డి, రసూల్, కళ్యాణ్, వీరాస్వామి, బాలయ్య, వెంకటరమణ పాల్గొన్నారు.

తప్పుడు ఆరోపణలపై చర్యలు తీసుకోండి



ఆత్మకూరు ఆర్డీఓ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఎరుకులసానినగర్ వాసులు

ఆత్మకూరురూరల్: పట్టణంలోని ఎరుకులసానినగర్‌లో నివసిస్తున్న ఎరుకుల కులస్తులు ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వారమని ధ్రువీకరణ పత్రాలు కావాలంటూ నకిలీ కుల అధ్యక్షుడు నల్గొండ శివకృష్ణ తదితరులు ఇటీవల అధికారులకు తప్పుడు ఆరోపణలతో దరఖాస్తు చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆత్మకూరుకు చెందిన పాములోళ్లు పలువురు ఆత్మకూరు ఆర్డీఓ కరుణకుమారిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. తొలుత వీరు ప్రదర్శనగా ఆర్డీఓ కార్యాలయానికి చేరుకుని తమకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. తరతరాలుగా ఆత్మకూరులో నివాసముంటున్న తాము ప్రభుత్వం ద్వారా ఎస్టీ సర్టిఫికెట్లు పొంది జీవిస్తున్నామని, తమపై నకిలీ కుల సంఘాల నాయకులు చేసే ఆరోపణలు ఖండిస్తున్నామన్నారు. అసలు ఎరుకుల కులస్తులు ఎస్టీలు కాదన్నారు. అధికారులు పూర్తిస్థాయిలో వాస్తవాలను విచారించి తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు గురునాథం తిరుపతయ్య, చిన్నబ్బాయ్య, ప్రసాద్, మల్లేశ్వరి, లక్ష్మీకళ, శ్రీహరి, అమర తదితరులతో పాటు మరో 200 మంది వరకు ఎరుకుల కులస్తులు పాల్గొన్నారు.

బస్సు ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ఎంవీఐ



బస్సు ప్రమాద ప్రాంతంలో పరిశీలిస్తున్న ఎంవీఐ రాములు

సంగం: సంగం మండలం అరవపాళెం వద్ద రేబాల కాలువలో పాఠశాల బస్సు ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని సోమవారం ఆత్మకూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ రాములు స్థానిక పోలీసులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఎంవీఐ మాట్లాడుతూ ప్రమాదం జరిగిన బస్సును పరిశీలించి ఏమైనా లోపాలు ఉంటే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పాఠశాల యాజమాన్యం బస్సులు నడిపే సమయంలో తప్పనిసరిగా రోడ్డు నియమ నిబంధనలు పాటించాలని సూచించారు. పాఠశాల యాజమాన్యం బస్సులు కండీషన్‌లో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పాఠశాల బస్సులు పిల్లలతో వెళ్లే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలని, లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

స్కూల్ బస్సులపై చర్యలు తీసుకోండి



ఎంవీఐకి వినతిపత్రం అందజేస్తున్న బీఎస్పీ నాయకులు

ఆత్మకూరురూరల్: నిబంధనలను అతిక్రమించి బస్సులు నడుపుతున్న ఆత్మకూరు శ్రీచైతన్య స్కూల్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకుని బస్సులను వెంటనే సీజ్ చేయాలని బీఎస్పీ ఆత్మకూరు అధ్యక్షుడు నందా ఓబులేసు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు సోమవారం ఆత్మకూరు డీఎస్పీ కోటారెడ్డి, ఎంవీఐ రాములుకు వినతిపత్రాలు అందజేశారు. విద్యార్థుల జీవితాలతో ముడిపడిన విషయాల్లో కూడా ప్రైవేట్ యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని, సత్వరం స్పందించి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ ఇన్‌చార్జి చెన్నుపల్లి రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి కృష్ణ, కోశాధికారి ధర్మయ్య, బీఎస్పీ కార్యకర్తలు పాల్గొన్నారు.